# శ్రీ రమణ జ్యోతి
డిశెంబర్ 2018

# Sri Ramana Jyothi
December 2018

ఈ సంచికలో ...

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.యస్. గారి 54వ ప్రవచనం | తాడిమేటి సత్యనారాయణ | 3 |
| 2. | శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు | కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి | 8 |
| 3. | ప్రాప్తస్యప్రాప్తిః | డా. వి. రామదాస్ మూర్తి | 12 |
| 4. | ఇది ఒక్కటే అబద్ధమా? | విడపనకంటి | 17 |
| 5. | సాధన - కృప | శ్రీవత్సస | 21 |
| 6. | శ్రీరమణ మహర్షి యొక్క దైవిక లీలలు | చావలి రమాబాల | 27 |
| 7. | Let Us Transcend Time & Space | Dr.K.Subrahmanian | 30 |
| 8. | Everything is Within | V.Krithivasan | 34 |
| 9. | Mirage of Knowledge | D.Samarender Reddy | 42 |
| 10. | There is Nothing Without | | 43 |
| 11. | Sadguru Sadashiva Brahmendra | M.Ashok | 44 |
| 12. | The Secret Of The Master | | 48 |
| 13. | Conversations With Sri Bhagavan | Darlene Delisi | 50 |


## Events in Sri Ramana Kendram in December

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 24th December: Bhagavan's 139th Jayanthi. The celebrations will be held in Kendram on following Sunday on 30th December, from 9 a.m. to 12 p.m.
4. 24th December - Punarvasu Satsang - 6.00 - 7.15 p.m.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**


**Editorial Board:** Telugu: **Dr. V. Ramadas Murthy, Malladi Phanimala, Katravulapalli Subbalakshmi**
English: **V. Krithivasan, N.S. Ramamohan, Sneha Choudhury**

# భూత, వర్తమాన, భవిష్యత్ కాలములు

ఆంగ్ల మూలం: డా॥ కే.యస్. గారి 54వ ప్రవచనం (1-1-93)

(గత సంచిక తరువాయి) తెలుగు అనువాదం: తాడిమేటి సత్యనారాయణ

ఒక పనిలో నిమగ్నమైనపుడు గతంలో జరిగినదానిని గుర్తు చేసుకొంటూ, భవిష్యత్తులో ఏమి జరగనున్నదో అనే భయంతో మనస్సు పనిచేస్తూంటుంది. గతంలో చేయలేక పోయాము. ఇపుడు కూడా చేయలేకపోతానేమోననే భయం. అసలు విషయమే మంటే, మనం వర్తమానంలో వుండకుండా, లేని గతం పైన, ఏమి జరుగుతుందో తెలియని భవిష్యత్ పైన మనస్సు పనిచేస్తుంది. ఈ విషయాన్ని లోతుగా విచారణ చేస్తే గతం లేదు, భవిష్యత్తు లేదు. ఉన్నది ఇప్పుడు, ఇక్కడ - వర్తమానమే అని గ్రహిస్తాము.

తలపులవల్ల ఎంత శక్తిని కోల్పోతున్నామో తెలియదు. గతం గురించి కాకుండ వర్తమానంలో మనస్సును నిలిపితే శక్తిని పోగొట్టుకొనం. ఇది ఎట్లాగ సాధ్యం? దీనికి సమాధానం మన పూర్వీకులిచ్చారు. ఏమిటది? గతానికి, భవిష్యత్తుకు సంబంధించిన తలపులను కేవలం ఒక సాక్షిగా చూడమన్నారు, అంతేగాని ఆ తలపులతో మమేకమై పోవద్దన్నారు. ఇట్లాగ చేయగలిగితే గత కర్మల వాసనల నుండి విడివడగలము. దీని భావమేమంటే ఒక సాక్షిగా తలపులను గమనిస్తూ అవి మంచివని, చెడ్డవనిగాని నిర్ణయించకుండ, తలపుల వెంట పరుగెత్తకుండా వుంటే మనం మానసిక కాలం నుండి విడిపడతాము. కాని మన నిత్య జీవితమంతా గతం, భవిష్యత్తు గురించే ఆలోచిస్తూ అందులో

మునిగిపోతాము. కనుకనే వర్తమానంలో నిలువలేక పోతున్నాము. మనకు ఒక సమస్య ఎదురయితే, దాని పరిష్కారం కొరకు మనస్సును పూర్తిగా దానిపై పెట్టలేకపోవడం చేత, పరిష్కారం దొరకడం లేదు. అందువలనే సమస్య మరొక కోణం నుండి తిరిగి తలెత్తుంది. గతంలో ఏమయింది, భవిష్యత్తులో ఏమవుతుంది అని ఆలోచించకుండ, పూర్తి శ్రద్ధతో, సావధానంతో సమస్యను గురించి ఆలోచిస్తే మంచి పరిష్కారం లభ్యమవుతుంది. అట్లాగే ఇతరులు ఎవరయినా తమ సమస్యల పరిష్కారం కొరకు మనల్ని అడిగితే, వారు చెప్పిన వివరాలను మనం సావధానంగా వినాలి. అట్లాగ వినినట్లయితే మనం చెప్పకుండానే వచ్చినవారి మనస్సులోనే పరిష్కారం దొరుకుతుంది. ఒకరు పరిష్కారమార్గం చూపించారనే దానికంటే తమకే పరిష్కారం లభించిందన్న తృప్తితో, ఆనందంతో తిరిగి వెళ్లిపోతారు.

జ్ఞానులనాశ్రయించి, మన సమస్యలను వారితో చెప్పుకోవలసిన అవసరం ఉండదు, వారి సన్నిధిలో కూర్చొంటే చాలు, ఆ నిశ్శబ్దంలోనే, మౌనంలోనే జ్ఞానికి విషయాలు అందుతాయి. ఆశ్రయించిన వ్యక్తి ఎంతో ఆందోళనలో వుంటాడు. జ్ఞాని సర్వజ్ఞులు. వారికి విన్నవించుకొంటే వారు అంతా వింటారు. వారు ఒక సామాన్యునివలె వ్యవహరిస్తారు. ప్రవర్తిస్తారు. ఇతరులను తమలో, తమను ఇతరులలో దర్శిస్తారు. తాము ఒక ప్రత్యేకమైన వ్యక్తి అని భగవాన్ రమణులు ఇతరులు ఎవ్వరితోనూ తెల్పుకోలేదు. ఎవ్వరు ఏమి చెప్పినా నిదానంగా వింటారు. ఒక చిన్నబిడ్డ “తన పెన్సిలు కనుబడటం లేదు. మీ దగ్గర వుందా?

తలగడక్రింద ఉందేమో''నని ప్రశ్నిస్తే వారు తమ తలగడను తీసి వెదకుతారు. భగవాన్ ఎందుకు ఇలాంటి చిన్న విషయాలపై కాలాన్ని వృథా చేస్తారని అనిపించవచ్చు. కాని మనకు తెలియదు. భగవాన్ ఒక బాలుని సమస్యను పరిష్కరిస్తున్నారు. ఆ బాలుని సమస్య ఏమిటో మనకంటే భగవానులకే తెలుసు. మనం ఆ బాలునికి ఇవ్వలేనిది భగవానులకే తెలుసు. మనం ఆ బాలునికి ఇవ్వలేనిది వారు ఇస్తున్నారు.

ఉదయం ఆరుగంటలకు మేల్కొని ధ్యానం చేసుకోవాలని అనుకొంటాము, గడియారం చూసి, పదినిమిషాల కంటే ధ్యానానికి సమయం ఇవ్వలేను అంటాము. త్వరగా ఆఫీసుకు వెళ్లాలన్నదే కారణం. సమయం గురించి ఆలోచించకుండ శ్రద్ధతో ధ్యానం చేస్తే, చేయదలచిన ఇతరపనులన్నీ సక్రమంగా, అతి తక్కువ సమయంలో పూర్తి చేయగల్గుతాము. ధ్యానంలో అంత శక్తి లభిస్తుంది. శక్తి అంటే వర్తమానంలో దృష్టిపెట్టగలిగే శక్తి అన్న మాట. మనస్సు పరిపరివిధాల బయటకు పోవడం వలన ఒక పనిని తక్కువ సమయంలో చేయలేక పోతున్నాము. ధ్యానమంటే ఏదో కళ్లు మూసుకొనడం కాదు. ధ్యానస్థితిలో ధ్యానం చేసే 'కర్త' ఉండడు. అట్టి వ్యక్తికి తాను ధ్యానం చేస్తున్నాననే ధ్యాస ఉండదు. అక్కడ చేసేవారు, చేయబడేది రెండూ ఒకటి అయిపోతాయి. అపుడు ఇక కాలమేది? దేశమేది? దేశకాలాల గురించిన ఎఱుక ఉండదు అక్కడ. దీనిని మనం నిత్యము గాఢ నిద్రలో అనుభవిస్తున్నాము. దీర్ఘనిద్రలో మనస్సు ఆత్మలో లయమై పోతుంది.

భగవాన్ అంటారు, మనస్సు ధ్యానం, పూజ, జపాలలో లేదా శరణొందిన స్థితిలో అత్యంత శక్తిని పొందుతుంది. ఎట్టి పనుల నయినా చేయడానికి తగినంత శక్తి వుంటుంది. అంతే కాకుండా పనిలో మునిగియున్నప్పుడు సమయం ఎట్లాగ గడుస్తున్నదో తెలియదు. ధ్యానంలో కర్త, క్రియ, చేస్తున్నాననే మనస్సు, సమయం, కాలత్రయాలు ఏవీ వుండవు. అదొక నిరంతరం సాగే ప్రవాహం వంటిది.

అందరూ సంతోషంగా ఉండాలనే శుభాకాంక్షలు అందజేసు కొంటారు. కాని విచిత్రమేమంటే ఎవ్వరూ సంవత్సరమంతా ఆనందంగా వుండలేరు. దుఃఖంతోనూ ఉండలేరు. మన భారతీయ సంస్కృతి, ఆచారం చాలా గొప్పది. జీవితంలో కష్ట సుఖాలుంటాయి వాటిని మనం సమదృష్టితో ఎదుర్కోవాలనే భావంతోనే నూతన సంవత్సరంలో ముఖ్యంగా దక్షిణ దేశ ప్రాంతాలలో ఉగాది పచ్చడి చేసుకొని తింటారు. అందులో వేప పూవు, బెల్లం, పుల్లటి పదార్థాలను కలిపి సేవిస్తారు. ఆ పదార్థం రుచి తీపి, చేదు, పులుపు కలిగి వుంటుంది. ఆ పదార్థాన్ని తిని, జీవితంలో కూడా మనకు ఎదురయ్యే కష్టసుఖాలను అట్లాగే అనుభవించాలనే ఆచారం మన సంస్కృతిలో ఒక ప్రధాన అంశం.

వీటి వెనుక ఉండేది మనస్సు. ఆ మనస్సును అట్లా సిద్ధపరచు కోవాలి. ఇది అనుగ్రహంతోనే సాధ్యం. కాఫీ త్రాగుతాము. అందులో పాలు, పంచదార, కాఫీ వంటి భిన్న రుచుల సమ్మేళనం. విడివిడిగా వాటి రుచులు వేరు. మిశ్రమంగా సేవించిన రుచి

వేరు. ఆ రుచిని అనుభవించడమే ఈ జీవితం అంటే. జీవిత మంటేనే ఎన్నో సంఘటనల మిశ్రమం. వాటిని సమదృష్టితో చూసి అనుభవించాలి. అప్పుడే జీవితానికి ఒక అర్థం. భగవాన్ అంటారు ఈ జగత్ పూర్ణమయినదని. కాని అర్థం చేసుకొని, అనుభవించడం కష్టం. లోకం ఎప్పుడూ సంపూర్ణ మయినదే. ఎట్టి లోపాలు లేనిది. భగవంతుని సృష్టి సంపూర్ణమైనది. మన దృష్టి లోపమే, దృక్పథమే ఆ పరిపూర్ణత్వాన్ని చూడలేక పోతున్నది. అహంకారం పోయినట్లయితే, లోకం అంతా ఆనందమయంగా, సంపూర్ణమయినదిగా కనబడుతుంది.

మన మధ్యలో భగవాన్ ఆనంద స్వరూపునిగా వెలుగు తున్నారు. వారు హిమాలయాలకు వెళ్లలేదు. ఇక్కడే ఆనందంగా ఉందన్నారు. మన మధ్యలో జీవించారు. ఆశ్రమ నియమాలను, షరతులను పాటించారు. కొందరు స్తుతించారు. కొందరు నిందించారు. అయినా వారు ఆనందస్థితిలోనే ఉన్నారు. ఒక వ్యక్తి కాలదేశాలకు అతీతంగా జీవించవచ్చు అనే ఒక విశ్వాసాన్ని కలుగజేశారు. అహంకారరహిత స్థితిలోనే ఇది సాధ్యం. ఆనంద స్థితిలో కాలదేశాలు లేవు. ఈ లోకంలో జీవిస్తున్నప్పుడు శుభాకాంక్షలు పంచుకొంటాము. భగవాన్ అనుగ్రహంతో అంతా శుభం కల్గుతుందనే ఆశించాలి. మనం కాలదేశాలకు అతీతంగా ఉందాము. భగవాన్ అనుగ్రహంతో సుఖసంతోషాలు కలుగు గాక! ఇప్పుడు, ఎప్పుడూను!!

*(సమాప్తం)*

# రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు
# స్వామి ప్రణవానందులు

- కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి

సర్వేపల్లి కుటుంబం అనగానే వేదాలు, శాస్త్రాలు, పురాణాలను ఔపోసన పట్టినవారని గుర్తుకు రావడం సహజం. భారతదేశం యొక్క పూర్వ అధ్యక్షులు మరియు ప్రపంచ ప్రఖ్యాతులయిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు దగ్గరి బంధువు. మరియు మార్గదర్శి, స్వామి ప్రణవానందులు. వీరి అసలు పేరు సర్వేపల్లి నరసింహం. సన్యాసదీక్ష తీసుకున్న తరువాత స్వామి ప్రణవానందగా పిలువ బడ్డారు.

18 సం॥ల వయస్సులో కర్ణాటకలోని 'కొల్లూరు' గురుకులానికి వెళ్ళి అక్కడ 'మూకాంబిక' అమ్మవారి దీవెనలను అందుకున్నారు. దీనితో వెనువెంటనే వీరికి తమ జీవిత లక్ష్యం సత్యాన్ని ఆవిష్కరించడమేనన్న భావన స్ఫురించింది. ఆత్మ విద్య ద్వారా మాత్రమే అంతిమ సత్యాన్ని కనుక్కోవడం సాధ్యమవుతుందని గ్రహించారు.

స్వామీజీ వెల్లూరులో ఒక మున్షీగా పనిచేస్తున్నప్పుడు అదే పట్టణంలో కావ్యకంఠ గణపతి ముని ఒక తెలుగు ఉపాధ్యాయు నిగా పనిచేస్తుడేవారు. అతి తక్కువ కాలంలోనే ఒకరికొకరు పరిచయమయ్యారు. స్వామీజీ తమకు కలిగే అనేక ఆధ్యాత్మిక సందేహాలను గణపతి ముని ద్వారా తీర్చుకున్నారు. అందువల్ల

1906 సం॥లో స్వామీజీ గణపతి మునిని ఒక గురువుగా భావించారు. ఇద్దరూ కలిసి 1910 సం॥లో అరుణాచలం లోని విరూపాక్ష గుహలో భగవాన్‌ను దర్శించుకున్నారు. భగవాన్‌ను చూడగానే స్వామీజీలో ఇంకా మిగిలిన సందేహాలన్నీ పటాపంచలై పోయాయి. అతి తక్కువ కాలంలోనే భగవాన్‌కు చాలా దగ్గరగా మెసలే సన్నిహితుల్లో ఒకరు కాగలిగారు. భగవాన్‌ను వేదస్వరూపునిగా చూసేవారు. మహర్షి కూడ వీరిని చాలా ప్రత్యేకంగా అభిమానించేవారు. భగవాన్ తెలిపే బోధనలన్నింటిని పుస్తకాలుగా వ్రాసేవారు.

భగవాన్ బోధించిన 'ఆత్మవిచారణ మార్గం, స్వామీజీని ఎంతగానో ఆకర్షించింది. మహర్షి గ్రంథాలను చాలా మటుకు తెలుగులోకి అనువదించారు. 'నేను ఎవరు', 'విచార సంగ్రహం', 'వివేక చూడామణి', 'ఆత్మబోధ' మొదలైన వాటిని తెలుగులోకి అనువదించారు. 'మహర్షి చరిత్రము', 'తత్వమసి', 'ధ్యానము', 'శ్రీగురు అనుగ్రహ అవతారము', 'శ్రీరమణ స్తుతి' మొదలగు గ్రంథాలను రచించారు. వారి రచనాశైలి చాలా సులువుగా, గొప్పగా అందరికీ అర్థమయ్యే రీతిలో వుంటుంది.

వీరు వెల్లూరులో ఆర్కాట్ క్రైస్తవ కళాశాలలో టీచర్‌గా పని చేసేటప్పుడు అక్కడి వారందరికి ధ్యానం చేసే పద్ధతిని నేర్పించారు. వీరు మతమార్పిడిని నిరసించారు. అందరూ ధ్యానం చేయాలి అని చెప్పేవారు. వీరు చెప్పే విధానం అక్కడి వారందరినీ ముగ్ధుల్ని చేసేది. ఆ కాలంలోని బ్రిటిష్ వాళ్ళు వీరి బోధనలకు,

భాషాప్రావీణ్యతకు ఆకర్షితులయ్యారు. అంతేగాక వీరి ఆలోచనలు, బోధనలు, నమ్మకాలు, బ్రిటిష్ వారికి ఎంతగానో ఆశ్చర్యాన్ని కలిగించేది.

చాలామంది యూరోపియన్లు వెల్లూరుకు వచ్చే అక్కడి స్థానిక భాషలు నేర్చుకునేవారు. దీనిలో వీరికి మంచి టీచర్‌గా గుర్తింపు రావడంతో ఒక ఆధ్యాత్మికవేత్తగా వీరి బోధనలు చాలామందికి ఆకట్టుకున్నాయి. వెల్లూరు సెంట్రల్ జైలుకు వెళ్ళి అక్కడి ఖైదీలకు నైతిక విలువలను గురించి బోధించి వాళ్ళను సంస్కరించారు. అంతేగాక వాళ్ళ పునరావాసానికి ఎంతగానో సహాయపడ్డారు.

స్వామీజీ గణపతిముని శిష్యులైనప్పటికి, అందరితో మాత్రం గర్వంగా భగవాన్ రమణ మహర్షి శిష్యుడని చాటుకున్నాడు. నిరాడంబరంగా, సదాశాంతంతో ప్రకాశించే భగవాన్ అంటే వీరికి అమితమైన భక్తి. ఎవరైనా భగవాన్‌ను ఒకటి లేదా రెండు సార్లే దర్శించుకున్నప్పటికీ భగవాన్ వాళ్ళపట్ల కనబరచే శ్రద్ధ అమోఘం అని వీరు తరచు చెబుతుండేవారు. ఒకనాడు వీరు, భగవాన్ కలిసివున్నప్పుడు ఒక కాకి ఆశ్రమంలోనికి వచ్చి భగవాన్ చేతుల్లో వ్రాలి ప్రాణం విడిచింది. అప్పుడు భగవాన్ "ఎవరో సాధు పురుషుడే దేహాన్ని విడిచాడు" అని అన్నారు. అంతేగాక అక్కడ వున్న భక్తులను కాకికి సమాధి కట్టమని ఆదేశించారు. (ప్రస్తుతం మనం ఈ కాకి సమాధిని శ్రీరమణాశ్రమంలో ఉత్తరం ప్రక్కన వుండటాన్ని గమనించవచ్చు). ఇదంతా గమనిస్తున్న స్వామీజీ

ఆనందబాష్పాలను కారుస్తూ భగవాన్‌తో "మీరు పూర్వ యుగంలో జటాయువుకు ముక్తిని అనుగ్రహించారు కదా! ఇప్పుడు ఈ యుగంలో కాకికి కూడ అంతే చేశారు" అని అన్నారు. దీనితో స్వామీజీకి భగవాన్ యందుగల భక్తి మనకు అర్థమవుతోంది.

ఒకసారి స్వామీజీ ప్రింటింగ్ ప్రెస్ నుంచీ భగవాన్ బోధనలకు సంబంధించిన ఒక పుస్తకాన్ని తెస్తూ ఆ ఎండలో నడిచేసరికి అలసిపోయి దగ్గర్లో కూలబడిపోతే, అప్పుడు భగవాన్ స్వామీజీ దగ్గరికి వచ్చి చల్లటి నీళ్ళతో స్వామీజీ కాళ్ళు కడిగారు. "ఎందుకు నీ దేహాన్ని ఇలా కష్టపెడతావు? నేనేమైనా ఇలా కష్టపెట్టమని చెప్పానా" అంటూ ఓదార్చారు. అంతటి భగవాన్ అపారమైన కరుణకు స్వామీజీ చలించిపోయారు.

1938 సం॥లో ఆశ్రమంలో భగవాన్ శిష్యులైన కులుమని శాస్త్రితో కలసి రుద్రమ్, నమకమ్, చమకమ్ చదువుతూ చివర్లో హరి ఓం, హరి ఓం, అంటూ భగవాన్‌లో ఐక్యమొందారు.

(ఆధారం: శ్రీరమణమహర్షితో ముఖాముఖి, ఇంటర్నెట్)

**నిర్వాణమనగా పూర్ణత్వం. పూర్ణస్థితిలో విషయము, విషయి, రెండూ లేవు. చూడడమూ లేదు. తెలుసుకొనడమూ లేదు. చూడడం, తెలుసుకొనడం అనేవి మనః ప్రవృత్తులు. నిర్వాణంలో, తానున్నాననే విశుద్ధానంద చైతన్యమే తప్ప ఇంకేమీ ఉండదు.**

# ప్రాప్తస్య ప్రాప్తిః (ఉన్నదానినే పొందడం)

(మౌంటెన్ పాత్ (ఏప్రిల్-జూన్ 2016) సంపుటి-53, సంచిక-2 లో 'ప్రాప్తస్య ప్రాప్తిః' అన్న శీర్షికతో ప్రచురింపబడిన 'కీవర్డ్' నుండి ఎన్నుకొనబడిన భాగాల తెలుగు అనువాదం)

ఆంగ్లమూలం: డా॥ జాన్ గ్రైమ్స్, అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

అద్వైత వేదాంత తత్త్వజ్ఞాన శాస్త్రంలో రెండు రకాలైన సంపాదనలను (ప్రాప్తి పొందడాన్ని) గురించి పేర్కొనబడింది. మొదటిది అప్పటి వరకు సాధించబడని దానిని సాధించడం. ఉదాహరణకు ఒక క్రొత్త కారును సంపాదించడం. అది దేశ, కాలాలకు సంబంధించినది. అంటే ప్రయత్నపూర్వకంగా సంపాదించబడిన ఒక పరిమితమైన ఫలితం - క్రొత్త కారు. ఈ విధంగా ప్రయత్నంతో పొందినది, లాభ, నష్టాలతో కూడి ఉంటుంది. ఒక స్థితిని పొందడం, మరొక దానిని కోల్పోవడం జరుగుతుందన్న మాట.

వేదాంతం రెండవ రకమైన సంపాదనను గురించి కూడ చెబుతుంది. అది, "పొందినదాన్నే పొందడం" (ప్రాప్తస్య ప్రాప్తిః). దానినే "నీకులేని దానిని పోగొట్టుకొనడం" అని కూడ అనవచ్చు. ఇది దేశ, కాలాలతో సంబంధం లేనిది. మనకు లేని దానినే మనం క్రొత్తగా పొందగలం. ప్రతి ఒక్కరు ఎల్లప్పుడు ఆత్మగానే ఉంటారు గనుక ఈ ప్రక్రియను "అప్పటికే ఉన్న దానినే పొందడము"గా అంటారు.

అనుభవ సిద్ధిని పొందడము, సాధించడము, గమ్యాన్ని చేరడము, ఇలాంటి మాటలు ఉపమానాలంకారాలుగా వాడబడినవని భగవాన్ రమణుల అభిప్రాయం. ఆత్మసాధన లక్ష్యాన్ని

చేరుకోవాలని, కొత్తగా దానిని పొందాలనుకోవడం, అన్నది శాశ్వతమైనది కాజాలదు. లక్ష్యమన్నది అప్పటికే ఉండి వుండాలి. ఎందువల్లనంటే, ఒక వ్యక్తి తన అహంతో లక్ష్యాన్ని సాధించాలని ప్రయత్నిస్తే, అది ఎలా విజయవంతమౌతుంది? అహం దానిని వెదకక ముందే లక్ష్యం అప్పటికే ఉండి వుండాలి. మరి అహాన్ని నాశనం చేసినప్పుడు ఎప్పటికీ అలాగే ఉండి, శాశ్వత మైన ఆత్మ మాత్రమే ఉంటుంది. అందుకే 'బంధం', 'విముక్తి' అన్నవి అహానికి సంబంధించినవిగా ఉండాలిగాని ఆత్మకు సంబంధించి నవి కానేరవు. ద్వంద్వం ఉన్నప్పుడు మాత్రమే బంధం, విముక్తి అన్న వాటికి అర్థముంటుంది. కాని ద్వంద్వత్వం అసలు లేకుంటే లేదా ద్వంద్వత్వం మనసులో, లేదా వ్యక్తి యొక్క అహంలో మాత్రమే ఉంటే, విముక్తి చేయబడేవాడు ఎవరు, విముక్తి చేసేది ఎవరు? ఆత్మ విచారణ ద్వారా మనో నాశనం జరిగినప్పుడు అలాంటి బంధవిముక్తులు అన్నవి లేవని తెలియవస్తుంది.

"ఆత్మను చేరుకొనడం, అందుకొనడం అని అంటే, ఆత్మ ఇక్కడ, ఇప్పుడు లేదని, దానిని క్రొత్తగా పొందాలని భావించవలసి వస్తుంది. క్రొత్తగా పొందబడినది ఏదైనసరే, నష్టమైపోతుంది కూడ. అంటే అది అశాశ్వతమైనది. ఏది శాశ్వతము కాదో దానిని పొందడం కోసం శ్రమించడం నిరర్థకం. అందుకే ఆత్మను చేరుకొనడమంటూ ఉండదని నేను అంటాను. నీకే ఆత్మ, నీవు ఇప్పటికే అది. అసలు విషయం ఏమిటంటే ఆ ఆనందస్థితి నీకు తెలియడం లేదు. అజ్ఞానం అడ్డుపడి ఆ పరిశుద్ధ ఆనందాన్ని తెరమరుగు చేస్తోంది. తప్పుడు అభిప్రాయం వల్ల ఏర్పడిన ఆ

అజ్ఞానాన్ని తొలగించుకొనడమే నీవు చేయవలసిన ప్రయత్నం. శరీరం, మనసు మొదలైన వాటిని ఆత్మగా భావించే తప్పుడు భావన తొలగినప్పుడు ఆత్మ ఒక్కటే మిగులుతుంది" అని భగవాన్ అన్నారు.

భగవాన్ పదేపదే చెబుతూ వచ్చిన ఉపదేశసారం "నీవు ఇప్పుడే ఈ క్షణమే 'అది'. ఎవరైన అభ్యంతరం తెలుపుతూ, నేను వెదకుతుండడమే నేను త్రోవ తప్పి అయోమయంలో ఉన్నాననడానికి ఋజువు కాదా, అని అంటే, "కాదు, నీవు అలా అనుకొంటున్నావు అంతే. దేనిని వెదకుతున్నావు? ఏది నీవుగా ఉన్నావో దానిని ఎలా వెదకి పట్టుకుంటావు?" అని జవాబు వస్తుంది. "ఒక విషయం చెబుతాను. ఒక్క క్షణం పాటు నీ అహాన్ని ప్రక్కకు పెట్టి గమనిస్తే అన్వేషిస్తున్న నీకే ఆ వెదకబడుతున్న వస్తువు అని తెలుస్తుంది. అంతా నీలోనే ఉంది" అని ఒక జ్ఞాని అన్నాడు. మరొక మాటలో చెప్పాలంటే దేనినైన వెదకడమంటే ఆ వెదకబడే వస్తువు అక్కడ లేదని అర్థం. రమణులు "ముక్తి అన్న దానిని ఎందుకు వెదకాలి, లేదా ఆశించాలి? బంధంలో ఉన్నప్పుడే ముక్తి కోసం వెదకాల్సి వస్తుంది. యథార్థమేమిటంటే, బంధం అన్నది లేదు. ఉన్నది విముక్తే. అసలు దానికి ఒక పేరు పెట్టి అలా వెదకడమెందుకు?" అన్నారు. సంతృప్తి చెందని వ్యక్తి "నిజమే. కాని మేము అజ్ఞానులం" అంటే అందుకు భగవాన్ జవాబు "అజ్ఞానాన్ని నశింపజేయి. చేయవలసినదంత అదొక్కటే. ముక్తికి సంబంధించిన అన్ని ప్రశ్నలకు అసలు తావు లేదు".

మోక్షసాధన గురించి అద్వైతం యొక్క అభిప్రాయాలు తెలుసు కొనాలంటే, పారమార్థిక, వ్యావహారిక దృక్పథాల మధ్య ఏర్పరచు కొన్న ప్రత్యేకతలను అర్థం చేసుకోవాలి. అది స్పష్టంగా తెలియని పక్షంలో గురువుల బోధనలను అపార్థం చేసుకుంటారు. కాని నిజానికి, అలా రెండు 'స్థాయిలు' లేదా రెండు 'నిజాలు' ఉన్నట్లు కాదని గుర్తుంచుకోవాలి. అది కేవలం ప్రాయోజిత ఉద్దేశ్యంతో ఏర్పాటు చేయబడింది. యథార్థమన్నది ఎప్పుడూ ఒక్కటే, కాని దానిని రెండు కోణాల నుండి పరికించవచ్చు. అంతే.

పై విషయాన్ని విశదపరచడానికి సూర్యుడిని ఉదాహరణగా తీసుకోవచ్చు. సూర్యుని దృష్టిలో సూర్యుడు ఉదయించడం, అస్తమించడం, చీకటి, వెలుతురు లోని పలు ఛాయలు అన్నది ఉండదు. నిర్వచన పూర్వకంగా చెప్పాలంటే, ఎక్కడ వెలుతురు ఉందో, అక్కడ చీకటి ఉండడానికి వీలు లేదు. ఇక భూమి మీది వ్యక్తి దృష్టిలో సూర్యుడు ఉదయిస్తాడు, అస్తమిస్తాడు. వెలుగు, చీకటి, వాటి మధ్య వివిధ ఛాయలు ఉంటాయి. అందుకే సూర్యుని వెలుగు చీకటికి శత్రువు అన్న అభిప్రాయానికి రావడం సమంజసమే. అలాగ రెండు దృక్కోణముల నుండి పరిశీలిస్తే, పై రెండు పరస్పర వ్యతిరేక నిర్ధారణలు సరియైనవే, నిజాలే. కాని గమనించే దృష్టిని బట్టి ఉంటుంది. సూర్యుని బట్టి చూస్తే 'అంతా వెలుగే', చీకటిని బట్టి చూస్తే సాపేక్షికంగా వెలుతురు ఉంది, వివిధ ఛాయలూ ఉన్నాయి. ఇప్పుడు ప్రశ్న: నీవు దేనితో ఏకీభవిస్తావు? నీవు భౌతిక శరీరమా? లేక చైతన్య స్వరూపమైన ఆత్మయా? సూర్యుడు ఎప్పుడైన చీకటిని చూశాడా?

కొంచెం ఆలోచించి చూడండి. ఆత్మను గురించిన అజ్ఞానం విషయంలో, అద్వైతంలో ఎన్నో వ్యత్యాసాలు ఉన్నట్లు ఒప్పు కోవడం జరిగింది. కాని జ్ఞాని యొక్క ఉద్దేశంలో ఉన్నది ఒకే బ్రహ్మన్/ఆత్మన్. ఒకటే ఒకటి, ద్వంద్వం కానిది. అందుకే లయం కావడం అన్నది లేదు, ఉత్పత్తి లేదు, ఎవరూ బంధంలో లేరు, విముక్తులు లేరు.

అప్పటికే ఉన్న దానిని క్రొత్తగా పొందడం, ఆత్మను క్రొత్తగా సాధించడమన్న విషయాన్ని గురించి భగవాన్ ఎన్నో ఉదాహరణల సహాయంతో ఎంతో అద్భుతంగా వివరించేవారు. అలాంటి వాటిలో ఒక స్త్రీ పోగొట్టుకున్నాననుకున్న కంఠహారం, తన మెడలోనే ఉందని ఆమె స్నేహితురాలు చెప్పినప్పుడు, ఎంతో సంతోషంతో గంతులు వేస్తూ "నా హారం మళ్ళీ వచ్చింది" అంటూ లాభం పొందినట్లు భావించింది. ఆవిడ హారాన్ని పోగొట్టుకుందా? మళ్ళీ అది క్రొత్తగా వచ్చి లాభపడిందా? ఇలాంటి పలు ఉదాహరణలు: - చిన్నప్పుడే తప్పిపోయి, అడవిలో పెరిగిన రాకుమారుడు, పెరిగి పెద్దయ్యాక కూడ తాను ఒక వేటగాడి కొడుకు అనుకోవడం; పదిమంది మందమతులు నదిని దాటి, ప్రతి ఒకడు తనను తప్ప, ఇతరులను లెక్కపెట్టి, ఒకడు మునిగిపోయాడని చింతించడం; సింహం, గాడిద ఉదంతం, భగవాన్ చెప్పేవారు.

ఆత్మ విషయంలో కూడ సామాన్య వ్యక్తులు అలాంటి భ్రమలో పడతారు, క్రొత్తగా కనుగొనాలని ఆరాటపడతారు. పొంది వున్న దానినే పొందాలని ప్రయత్నిస్తుంటారు. ఇలాంటి తమ వ్యర్థ ప్రయత్నం గురించి తామే నవ్వుకునే రోజు ఎప్పుడో వస్తుంది.

# ఇది ఒక్కటే అబద్ధమా?

(శ్రీరమణ జ్యోతి (జూలై 2017)లో "ఈజ్ దిస్ అలోన్ ఫాల్స్" అన్న శ్రీ సాధు ఓం గారి రచన యొక్క స్వేచ్ఛానువాదం)

అనువాదం: విడపనకంటి

శ్రీరమణాశ్రమం యొక్క సర్వాధికారి శ్రీ నిరంజనానంద స్వామి శ్రీరమణ మహర్షి యొక్క మొదటి సమగ్ర జీవితచరిత్ర తమిళంలో రచింపబడాలన్న కోరికను వెలిబుచ్చేవారు. కాని అప్పటికే శ్రీ బి.వి. నరసింహస్వామి ఇంగ్లీషులో మహర్షి చరిత్ర వ్రాయాలని దానికి సంబంధించిన విశేషాలను సేకరించారు. ఈ ఇంగ్లీషు పుస్తకాన్ని ప్రచురించడానికి ముందే, ఒక మళయాళ పండితుడు రమణుల దర్శనం కోసం వచ్చాడు. ఆ వ్యక్తికి తాము సందర్శించుకున్న గొప్ప వ్యక్తుల జీవిత కథలను రచించే అలవాటు వుండేది. అందుకే భగవాన్‌ను దర్శించిన వెంటనే మహర్షి జీవితచరిత్రను వ్రాయాలన్న ఉత్సాహం వచ్చింది.

అందుకని, ఎవరో స్థానిక ప్రజలను కలిసి సమాచారం సేకరించడం మొదలు పెట్టాడు. "ఈ రమణ మహర్షి ఎవరు? ఎక్కడ పుట్టారు?" ఇలాంటి విషయాలను అడిగాడు. సామాన్య ప్రజానీకానికి భగవాన్ గొప్పవారని, ఆత్మసాక్షాత్కారం పొందిన జ్ఞాని అని గాని, ఇతర ఆధ్యాత్మిక విషయాలు గాని తెలియనందు వల్ల ఏవో అబద్ధాలు తమకు తోచినవి, ఊహించుకున్నవి, చెప్పారు. మహర్షికి మానవాతీత శక్తులు, సిద్ధులు ఉన్నాయని, అన్నారు. తద్వారా భగవాన్‌ను తాము ఘనంగా కీర్తించామన్న

ఉద్దేశంతో అలా చెప్పారు. అసలు రమణులు 'సిద్ధులు' పొందడ మన్నది బహుచిన్న విషయమని, ఆధ్యాత్మిక ప్రగతిని ఆశించేవారు అవి మోసపూర్తిమైనవని అలాంటివి నమ్మకూడదని చెబుతున్నప్ప టికీ అలాంటి ప్రకటనల నుండి తప్పించుకోలేక పోయారు. దురదృష్టవశాత్తు మళయాళ పండితుడు అటువంటి జనం నుండి అసత్యము, అసంబద్ధము, అయిన సమాచారాన్ని సేకరించాడు.

ఒక్కరోజులోనే ఆ పండితుడు తాను సేకరించిన విషయాలను కూర్చి మహర్షి జీవితచరిత్రను పూర్తి చేశాడు. ఆయన తెలుసుకున్న సమాచారం ప్రకారం భగవాన్ ముగ్గురు సంతానం గల ఒక గృహస్థు! మదురై నుండి అక్కడకు వచ్చిన న్యాయవాది. పలు ప్రాంతాలలో మహర్షి ఎన్నో 'సిద్ధు'లను ప్రదర్శించారు. ఇంకా ఎన్నో అవాక్కులు, చెవాక్కులు ఆ పండితుడు వ్రాసిన జీవిత చరిత్రలో చోటు చేసుకున్నాయి.

శ్రీరమణమహర్షి దగ్గరికి అతను ఆ సంకలనాన్ని తీసుకెళ్ళాడు. ఆ రోజుల్లో భగవాన్ వద్ద వున్న సాధకులు. భక్తుల్లో ఒక్క కుంజు స్వామికి తప్ప ఎవరికీ మళయాళం తెలియదు. ఆ రోజున కుంజుస్వామి అక్కడ లేరు. స్వయంగా మళయాళ భాష, సాహిత్యం తెలిసిన మహర్షి ఆ చరిత్రను మొదటి నుండి చివరి వరకు చదివి, అందులో చిన్న చిన్న ఉచ్చారణ దోషాలను మాత్రం సరిదిద్దారు. ఇక ఏ సలహాగాని, అభిప్రాయం గాని ఇవ్వకుండ రచయితకు వాపసు ఇచ్చారు. తాను వ్రాసిన జీవిత చరిత్రను భఘవాన్ స్వయంగా చదివి, వారే దిద్దుబాట్లు చేసినందున, తప్పులేవీ లేవని భావించి ఆ పండితుడు సంతోషించాడు.

ఆశ్రమంలోని భక్తుల్లో భగవాన్ జీవిత చరిత్ర మళయాళంలో వ్రాయబడిందన్న వార్త ప్రాకింది. కాని ఎవరికీ ఆ భాష రానందున అందులో ఏమి వ్రాయబడి వున్నదో తెలియలేదు. ప్రక్కరోజు కుంజుస్వామి ఆశ్రమానికి వచ్చినప్పుడు వాళ్ళు ఆయనతో ఉత్సాహంగా "ఈ క్రొత్త భక్తుడు భగవాన్ జీవితచరిత్రను మళయాళంలో రచించారు. స్వయంగా భగవానే దాన్ని చదివి అన్ని దిద్దుబాట్లు చేసిన తరువాత సరిగా వున్నదన్నారు" అని చెప్పారు. ఎంతో ఆశ్చర్యం, సంతోషంతో కుంజుస్వామి పుస్తకాన్ని ఆ పండితుడినుండి తీసుకుని చదవడం మొదలు పెట్టాడు. కాని అందులోని అసత్యాలను గమనించి తట్టుకోలేక పోయాడు.

కుంజుస్వామి రచయిత వద్దకు వెళ్ళి, నేర్పుగా "ఈ జీవిత చరిత్రలోని పలు అంశాలు పూర్తిగా అసత్యాలు. మీరు అసలు విషయాలను తెలిసినవారి దగ్గరకు వెళ్ళి సమాచారాన్ని సేకరించ లేనట్లుంది" అని అన్నాడు. కాని రచయిత ఎంతో ధైర్యంగా, "ఇందులో ఒక తప్పు కూడలేదు. చూడండి. స్వయంగా తమ కలంతో మహర్షి అవసరమైన చోట దిద్దారు. అందుకే ఇది సరియైన చరిత్ర అని గాఢంగా నమ్ముతున్నాను" అని జవాబిచ్చాడు. ఇక ఏమీ మాట్లాడకుండ కుంజుస్వామి పుస్తకాన్ని భగవాన్ వద్దకు తీసుకుని వచ్చి, "భగవాన్, మీ దస్తూరీ ఇందులో పలుచోట్ల కనిపిస్తోంది. అంటే, మీరు దీన్ని చూసి వుండాలి. కాని, ఇదంతా ఎలా నిజమౌతుంది? అని అడిగారు. తమ చేతిని చుట్టూ ప్రపంచం వైపుకు చూపిస్తూ, "ఇవి అన్నీ నిజాలా? ఇదొక్కటే అబద్ధమా? అని నింపాదిగా నవ్వుతూ అన్నారు.

ఈ ఉదంతం బయటి నుండి గమనించడానికి హాస్యపూరిత మని అనిపించవచ్చు. కాని, ఇందులో గొప్ప బోధన గుప్తంగా వుంది. ఎప్పుడూ భగవాన్ ఈ అగుపడే ప్రపంచం సత్యమైనది కాదని తమ అపార అనుభవంతో చెబుతూనే వుంటారు. అంతేకాదు దాన్ని దర్శించే వ్యక్తి కూడ అసత్యమే. ఇదే సంగతిని భగవాన్ ఈ సందర్భంలో కూడ మర్మంగా చెప్పారు. ఆత్మ గురించిన ఎఱుక లేని వారు తమకు ఖ్యాతి తెచ్చిపెడుతుందనుకునే జీవిత విశేషాలను తెలుపకుండ, లేదా వక్రీకరించి చూపిస్తే కోపగించు కుంటారు.

ఈ ప్రపంచంలో తాము గొప్పవాళ్ళమనుకునే పెద్ద మనుషులు ఎందరో వుంటారు. అలాంటి వారు తమ గొప్పదనాన్ని అందరూ పొగడుతూ వుండాలని తాపత్రయపడుతూ వుంటారు. అలాంటప్పుడు తమను గురించి అసత్యమైన సంగతులు అవమానకరమైన రీతిలో వ్రాయబడినప్పటికి, దాన్ని పట్టించు కోకుండ అంత ఉదాసీనంగా వున్నారంటే మహర్షి గొప్పతనం ఎంత స్తుతించదగినదో అర్థమౌతోంది. వారు మనం మన కళ్ళతో చూసిన సంగతులను తెలిపే ప్రస్తుత జీవిత చరిత్ర కూడ ఆ మళయాళ భాషలో వ్రాసిన జీవితచరిత్ర ఎంత నిజమో, ఇది అంతే సత్యమని భావించగల ఘనులు. అంటే భగవాన్ దృష్టిలో తమ పుట్టుక, ఆత్మసాక్షాత్కార అనుభవం, త్యాగం, జగద్గురువుగా ఎదిగినవారి జీవితం, ఇవన్నీ ఈ మళయాల జీవిత చరిత్ర ఎంత సత్యమో లేదా అసత్యమో, అవీ అంతేనని భావించేవారని అనుకోవచ్చు. (ఆధారం: మహర్షి న్యూస్ లెటర్, 2005, శ్రీరమణజ్యోతి జూలై 2017)

# సాధన - కృప

(శ్రీరమణజ్యోతి, సెప్టెంబర్, 2016 సంచికలో ప్రచురితమైన "ఎఫర్ట్ అండ్ గ్రేస్" అన్న శ్రీ వి. కృత్తివాసన్ గారి వ్యాసానికి తెలుగు అనువాదం)

అనువాదం: శ్రీవత్సస

ఆత్మను గురించి తెలుపుతూ, ముండకోపనిషత్తులో ఒక విఖ్యాత సంక్షిప్త వివరణ ఇలా ఉంది: ''నాయమాత్మా ప్రవచనేన లభ్యః; నమేధయా, న బహునాశృతేన''. ఆత్మను వేదాల వల్ల గాని, బుద్ధి కుశలత ద్వారా గాని, ఆఖరకుకు పవిత్రమైన దైవ సంబంధ కథలను మరింతగా వినడం వల్ల గాని తెలుసుకొనలేము. అని దాని అర్థము.

అదే ఉపనిషత్తులో మరొక వాక్యంలో, ''యమేవైషవృణుతే తేన లభ్యః'' అని చెప్పబడింది. ఈ వాక్యంపై రెండు పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యానాలు చేయవచ్చు: 1. ఎవరు ఆత్మ కోసం ప్రయత్నిస్తారో వారికి ఆత్మ లభిస్తుంది. 2. ఆత్మ ఎవరిని ఎన్నుకొంటుందో వారు దానిని (ఆత్మను) అనుభవంలోనికి తెచ్చుకుంటారు. మొదట చెప్పిన విధంగా శ్రీశంకరులు అన్వయించారని, శ్రీరామానుజులు దానికి రెండవ రీతిలో వివరణ ఇచ్చారని, పండితుల అభిప్రాయం. మొదటి వ్యాఖ్యానం ప్రకారం సాధకుడు ప్రయత్నిస్తే ఆత్మ సాక్షాత్కారం లభిస్తుందని అర్థమవుతుంది. ఇక రెండవ అన్వయం ప్రయత్నం వల్ల కాదు, ఆత్మ ఎవ్వరిని కోరుకుంటుందో వారికి దైవ కృప వల్ల సాక్షాత్కారం లభిస్తుంది, అని తెలుపుతోంది. మొదటి వ్యాఖ్యానాన్ని పరిశీలిస్తే ''అసలు కృప యొక్క అవసరం ఉన్నదా?'' అన్న ప్రశ్న

ఉదయిస్తుంది. రెండవ వ్యాఖ్యానం వల్ల ఉత్పన్నమయ్యే ప్రశ్న: "కృప ఒక్కటి మాత్రమే ముక్తిని ప్రసాదించగలిగినప్పుడు దాని కోసం ప్రయత్నం చేయడమెందుకు?".

భగవాన్ మహానిర్వాణం తరువాత కలకత్తాలో మా ఆనంద మయిని దర్శించినప్పుడు ఆమెను "పై రెండింటిలో ఏ వ్యాఖ్యానం సరియైనద"ని శ్రీ ఎన్. బలరాం రెడ్డిగారు ప్రశ్నించారట. జ్ఞాని అయిన ఆమె చిరునవ్వుతో "రెండూ సరియైనవే" అని బదులిచ్చారట. ఈ జవాబు అప్పటికే గందరగోళంగా వున్న పరిస్థితిని మరింత జటిలం చేసినట్లు అనిపిస్తుంది. కాని వేరు వేరు సందర్భాలలో భగవాన్ చెప్పిన విషయాలను విశ్లేషించి చూస్తే, ఏ కలవరము ఉండదు.

అసలు మనం మొట్టమొదట భగవాన్ అభిప్రాయంలో "ప్రయత్నం" లేదా సాధన యొక్క స్వభావం ఏమిటో అర్థం చేసుకోవాలి. ఆత్మసాక్షాత్కారమన్నది సాధించబడడానికి అదేదో క్రొత్తగా ఏర్పడినది కాదు. దాని ఉనికి నిరంతరం ఉన్నదే. దాన్ని కనుగొనడం, బహిరంగపరచడం మాత్రమే జరుగుతుంది. సూర్యుడిని మబ్బులు దాచినట్లు, లేదా స్వచ్ఛమైన నీటిని నాచు కప్పినట్లు, అజ్ఞానం చేత యథార్థమైనది కనిపించకపోతుంది. అంతకంటే మెరుగైన పదం దొరకని కారణంగా మనం ఆత్మ సాక్షాత్కారమన్న పదాన్ని వాడుతాము. అసలు అదొక్కటే యథార్థ మైనప్పుడు ఎవరైన మళ్ళీ యథార్థపరచుకొనడం, లేదా నిజం చేయడం ఎలా సాధ్యపడుతుంది? మనం చేయవలసినది ఒకటే. నిజంకాని దానిని నిజమైనదిగా భావించే అలవాటును

మానుకొనడమే! అన్ని మతాచారాలు ఈ విషయంలో మనకు సహాయపడడానికే ఉద్దేశించబడినవి. అలాగ మనం యథార్థం కాని దానిని యథార్థమని భావించడం మానివేస్తే, అప్పుడు యథార్థంగా ఉన్నది మిగులుతుంది, అదే మనం. (డే బై డే విత్ భగవాన్)

మళ్ళీ మహర్షి "సాధన అవసరమే, కాని దేని కోసం? ఆత్మ ఎల్లప్పుడూ అన్ని చోట్ల ఉంది. అందుకే దానిని మరెక్కడి నుండి గాని తీసుకు వచ్చే ప్రయత్నం అవసరం లేదు. అసలైన ఆత్మను గర్తించడంలో అడ్డుకునే శారీరకమైన, ఇంకా యితర భ్రమలను తొలగించడానికి మాత్రమే సాధన అవసరం. సత్యమైన ఆత్మను గమనించకుండ, ఈ లౌకిక ప్రపంచం యథార్థమని అను కున్నప్పుడే ఇలాంటి భ్రమలు చోటు చేసుకుంటాయి. ఈ భ్రమను వదిలించుకొనడానికే సాధన చేయాలి" అంటారు (లెటర్స్, 68)

అందుకే మనం చేసే ప్రయత్నాలు అజ్ఞానాన్ని వదిలించుకునే దిశలో వుండాలి. మరో విధంగా చెప్పాలంటే, అహం అనే అడ్డంకిని తొలగించుకోవాలి. దాని కోసం వ్యక్తి భ్రమపూరితమైన అహాన్ని సృజించే అన్ని అంశాలను పట్టు విడువకుండ, సంకల్పశక్తి నేర్పులతో గుర్తించి వాటిని పూర్తిగా రూపుమాపాలి. వినడానికి తార్కికంగా (న్యాయంగా) ఉన్నట్లు అనిపించవచ్చుగాని, మనం తెలుసుకొనవలసినది ఏమిటంటే, మనం అహాన్ని నిర్మూలించ డానికి అహాన్నే ఉపయోగించాల్సి వస్తుంది! అంటే అహాన్ని వదిలించుకునేందుకు ఆ అహాన్నే వినియోగించి తనకంటే భిన్నమైన దానిని కనుగొనడానికి ప్రయత్నిస్తున్నామన్న మాట.

ఇది విపరీతం గాను, విరుద్ధంగాను అనిపిస్తుంది. కాని భగవాన్ "ఈ 'నేను' అన్నదే, 'నేను' అన్న భ్రమను తొలగించి 'నేను'గానే మిగిలిపోతుంది" అంటారు. ఆత్మసాక్షాత్కారమన్నది అలాంటి విపరీతమైన విషయం. అయినప్పటికి, సాక్షాత్తుగా అనుభవించిన జ్ఞానులకు ఇందులో ఏ వైరుధ్యంగాని, వైపరీత్యం గాని వున్నట్లు తోచదు" అన్నారు (టాక్స్ 28).

ఇక దైవకృప యొక్క ప్రాముఖ్యాన్ని గురించి చూద్దాము. కపాలి శాస్త్రిగారు ఒకసారి మహర్షిని "నేను బాహ్యమైన సహాయాన్ని ఆశించకుండ, నా స్వంత ప్రయత్నంతో మాత్రమే యథార్థాన్ని గుర్తించగలనా" అని అడిగారట. అందుకు భగవాన్ "ఆత్మను అన్వేషించాలనే కోరిక నీలో కలగడమే దైవకృప వల్ల కలుగుతుంది. అది హృదయం లోపల తేజస్సు, ఒక ప్రకాశం రూపంలో అసలైన చైతన్యంగా ఉంటుంది. నిన్ను లోపలికి ఆకర్షిస్తూ వుంటుంది. కాని దానిని పొందడానికి నీవు బయటి నుండి ప్రయత్నం చేయాలి. ఆ ప్రయత్నం అన్నదే నీ జిజ్ఞాసపూర్వక అన్వేషణ. అందుకే, కృప లేకుండ తీవ్రమైన అన్వేషణ మొదలు కాదు. అలాగే ఆత్మాన్వేషణకై గాఢమైన కోరిక లేనప్పుడు వారిపై కృప చురుకుగా ప్రసరించదు. రెండూ అవసరమే" అన్నారు. (సద్దర్శన భాష్య)

పై విషయాన్ని మరింత నొక్కి చెబుతూ, "దైవ కృప సాక్షాత్కారానికి అతి ముఖ్యమైనది. అది భగవంతుని గురించిన పూర్తి అవగాహనకు దారి తీస్తుంది. ఈ శృంఖలాలనుండి విముక్తి చెందాలన్న తపన నిరంతరం కనబరిచే నిజమైన భక్తుడు లేదా

యోగి మాత్రమే అలాంటి కృప తప్పక లభిస్తుందనే హామీని ఆశించవచ్చు'' అని మహర్షి అన్నారు. (టాక్స్ 29).

దీనిని బట్టి మనిషి తనను పరిమితులకు లోబడిన వ్యక్తిగా మాత్రమే గుర్తిస్తున్నంత కాలం, తనకు, తాను నిరసిస్తూ, సంచరిస్తున్న ఈ ప్రపంచానికీ సంబంధించిన సత్యాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తూనే వుండాలని తెలుస్తోంది. ఎందుకంటే, ఎప్పుడో ఒకప్పుడు తన పరిస్థితిలోని అసంపూర్ణత్వం తప్పక బహిర్గతమవుతుంది. తన కోరికలు, ఆశలు మొత్తం ఫలవంతం కావు. ఈ జీవితం తీరే అంత. తనకు సంపూర్ణ తృప్తి, ఆనందం కలగాలని అన్వేషణ మొదలుపెట్టినప్పుడు ఎదురవు తున్న అడ్డంకులను తొలగించుకొనడానికి అవసరమైన సాధనలో తప్పక మునిగిపోవలసి వస్తుంది. సాధన పురోగతి చెందేకొద్దీ, తన అసహాయతను గుర్తించి దైవకృప లేకుండ ఈ ప్రయాణం ఫలవంతం కాజాలదన్న నిజాన్ని గుర్తిస్తాడు. ఈ దశను గురించి వ్యాఖ్యానిస్తూ, ''జవాబులేని ఈ ప్రశ్నను ఎదుర్కొనడంలో తన శక్తి, వనరులు ఇక ఏ మాత్రం ఉపయోగపడవన్న భావనతో మనసు దిగ్భ్రమ చెందినప్పుడు, ఒక ఉన్నత శక్తి మనసును అదుపు లోనికి తీసుకుని, ఆ యథార్థము, అద్భుతము అయిన చైతన్యాన్ని బహిర్గతం చేస్తుంది'' అని అన్నారు. (శ్రీకృష్ణ భిక్షుగారి 'రెమెనిసెన్సస్') వ్యక్తి యొక్క ప్రయత్నం ద్వారా మాత్రమే వాసనలను పూర్తిగా తొలగించుకొనడం సాధ్యం కాదు.

ఒక పార్శీ భక్తునితో సంభాషిస్తూ భగవాన్, ''నీవు చేయ గలిగినది అహం యొక్క మూలాన్ని గుర్తించి అందులో స్థిరంగా

ఉండడమే. నీ ప్రయత్నం అక్కడితో ముగుస్తుంది. ఆ తరువాత పై శక్తి చేయవలసినదానిని చేస్తుంది. అప్పుడు నీవు పూర్తిగా అశక్తుడివి. ఇక ''ఏ ప్రయత్నమూ లక్ష్యాన్ని సాధించలేదు'' అన్నారు. (టాక్స్, 197)

సాధన యొక్క ఆఖరి దశల్లో, 'ఆత్మ సాక్షాత్కారం' పొందాలన్న ప్రయత్నాలు ఇంకా జరిగితే అవి అహం యొక్క ఉనికిని మరింత పొడిగించే వ్యతిరేక ఫలితాలను ఇస్తాయి. ఈ విషయం సాధకులు గుర్తుంచుకోవాలి. ఆ దశలో మనసు అన్ని ప్రయత్నాలను తప్పక విరమించాలి. చేయవలసినది మనసును స్థిరంగా ఉంచడమే. మోక్షం పొందాలన్న కోరికతో సహా అన్ని కోరికలను చంపితే ఉన్నత శక్తి తన ప్రభావాన్ని చూపసాగుతుంది. ఉప్పుతో చేయబడిన బొమ్మ సముద్రంలో కలిసిపోతుంది. పూర్వం నుండి కూడ ఎప్పుడూ ఉనికి లేని అసత్యాలు అధిగమింపబడతాయి. ఆత్మ యొక్క అసలు వైభవం బయటపడుతుంది.

అన్వేషణ యొక్క మొదటి దశలో పట్టు విడువని ప్రయత్నం, సాధన ముఖ్యమైతే, చివరి దశలో దైవ కృప కోసం ఓర్పుతో వేచి వుండడమే ప్రధానాంశం అవుతుంది. మా ఆనందమయి ''రెండు వాదనలు సరియైనవే'' అన్న జవాబు ఏ విధంగాను దిగ్భ్రమను కలిగించే అవకాశం లేదు.

**అహంకారం తొలగని వైరాగ్యం నిష్ప్రయోజనం. అహంకారం అంతరిస్తే ఎన్ని సంపదలున్నా అవి బంధ హేతువులు కానేరవు.**

# శ్రీరమణ మహర్షి యొక్క దైవిక లీలలు

- చావలి రమాబాల

## సిద్ధి ప్రదర్శన అపురూపం

ఎమ్.ఎస్. వెంకట్రామ అయ్యరు భగవానుతో ఆటలలో మల్ల యుద్ధము మొదలగు వాటి యందు చిన్ననాటి స్నేహితులు. భగవాన్ తిరువణ్ణామలై వచ్చిన తరువాత వారు తరచు ఆశ్రమానికి వచ్చెడి వారు. అప్పుడప్పుడు వారి కుటుంబమును కూడా తెచ్చేవారు.

ఒకసారి కుటుంబంతో ఆశ్రమములో కొన్ని రోజులు వుండడానికి వచ్చారు. భగవాన్, ఇంకా కొందరు భక్తులు అరుణాచలం పైకి వెళ్ళుటకు నిర్ణయించుకొన్నారు. వెంకట్రామ అయ్యరు, రామనాథ బ్రహ్మచారి ఆశ్రమములో మధ్యాహ్న భోజనము సిద్ధం చేసేందుకు ఉండిపోయారు. భోజనము తయారైంది వారు దానిని ఒక పెద్ద పాత్రలో సర్దగా వెంకట్రామ అయ్యరు దానిని తలపై పెట్టుకొని బయలుదేరారు. రామనాథ బ్రహ్మచారికి కూడా మోసేందుకు చాలా ఉంది. వాళ్లు బరువుతో కొండ నెక్కడం ప్రారంభించారు.

అంతలో భగవాన్ మరియు కొందరు భక్తులు "సెవెన్ స్ప్రింగ్స్" ఉన్న చోటకు చేరి అక్కడ విశ్రాంతి తీసుకోదలచారు. వెంకట్రామ అయ్యరు భార్య భగవానుల వద్దనే వుండిపోయింది. మిగిలిన వారు శిఖరం దిశగా బయలు దేరారు.

వెంకట్రామ అయ్యరు, రామనాథ బ్రహ్మచారి కష్టపడుతూ కొండ నెక్కుతూ భగవాన్ ముందుకు వెళ్ళడాన్ని చూశారు. కాని భగవాన్ వారిద్దరికి పరిచయము లేని కొత్త దారిని పట్టారు. భగవాను తమకు దగ్గరి దారిని చూపుచున్నారని అనుకొని వారు భగవానులను అనుసరించారు. భగవానులను చూసిన వెంటనే వారికి అలసట పోయి, బరువు తగ్గినట్లయి తొందరగా గమ్యము చేరారు.

అక్కడ భగవాను భక్తులతో కూర్చుని ఆహ్లాదంగా మాట్లాడడం గమనించారు. అంతకు ముందు అక్కడ నుంచి భగవాన్ కదిలి నట్లు సూచనలు వాళ్ళకు లేవు. వెంకట్రామ అయ్యరు "ఇది ఏమిటి? మీరు మాకు దగ్గర దారి చూపేందుకు క్రిందకు వచ్చి మళ్ళీ ఇక్కడ ఏమీ జరగనట్లు నటిస్తూ కూర్చున్నారని గట్టిగా అరిచాడు. ఆయన అనుకోకుండ అలా అరిచేసరికి భక్తులందరూ నిశ్చేష్టులయ్యారు. భగవాను మౌనముగా నుండి "కంగారుపడకండి ఆయన సర్దుకుంటారు" అన్నారు. వెంటనే వెంకట్రామయ్యరు మామూలు స్థితికి వచ్చారు. ఆశ్చర్యపోవడం మిగతావారి వంతు అయ్యింది.

## గురువే ఈశ్వరుడు

భగవాన్ చిన్ననాటి స్నేహితుడైన వేలైచ్చేరి రంగ అయ్యరు ఒకసారి తాను కుంభకోణంకు పుష్కర స్నానము చేయడానికి కుటుంబముతో వెడుతున్నట్లు  జాబు వ్రాసిరి. రంగఅయ్యరు అనుకున్నట్లుగానే కుంభకోణం వెళ్ళారు, కాని అసలైన పండుగ

రోజు ఆయన స్కందాశ్రమానికి రావడానికి నిశ్చయించి, కుటుంబముతో కలిసి వచ్చారు. వారిని చూడగానే “భగవాన్! ఇదేమిటి రంగా, నీవు కుటుంబంతో కుంభకోణానికి కదా వెళ్ళవలసింది. ప్రయాణాన్ని మార్చుకుని ఇక్కడకు వచ్చావేమి అని ఆశ్చర్యంగా అడిగారు.

ఈ స్థలం కుంభకోణం కన్నా పవిత్రమైనది నాకు. ఇక్కడ ఉన్న భగవంతుడు, కుంభకోణంలోని దేవుని కన్న గొప్పవాడని నాకు తోచింది అని చెప్పారు. భగవాన్ మౌనంగా ఉండిపోయారు.

ఆశ్రమం నుంచి బయలుదేరే రోజు, రంగ అయ్యారు భగవానుల దగ్గర సెలవు తీసుకొనేందుకు వచ్చారు. ఆయన కళ్ళనిండా నీరు నింపుకుని తన గురువును వదలి వెళ్ళడానికి బాధపడుతూ నిలుచున్నారు. భగవాన్ అనురాగపూరితమైన కంఠంతో, దయగా, “రంగా నీవు స్కందాశ్రమానికి కుంభకోణం నుండి వచ్చి, ఇప్పుడు స్కందాశ్రమము నుండి మధురైకి బయలు దేరుతున్నావు. నీవు ఎక్కడ నుండీ రాలేదు. నీవు ఎక్కడికీ వెళ్ళడం లేదు. నీవు ఎప్పుడూ ఒకే చోట వున్నావు. నీవు రావడం, వెళ్ళడం అంటూ ఏమీ లేదు. నీకు కనిపించే ఈ ప్రయాణాలన్ని నీ ఊహ మాత్రమే” అన్నారు. నేను చెప్పునది నీవు కనుక సరిగ్గా అర్థము చేసుకొంటే, నీవు ఎప్పుడూ నాతోనే ఉన్నావని తెలుసు కుంటావు. నీవు నన్ను ఎప్పటికీ వదలలేవు, లేదా నేను నిన్ను ఎప్పుడూ వదలను” అని నొక్కి చెప్పారు. గురువే సర్వస్వమూ అనడానికి భక్తునికి ఇంతకంటే వేరు నిదర్శనమేమి ఉంది.

# Let Us Transcend Time and Space

Dr.K. Subrahmanian (Talk 54B)

If we don't concentrate on the past or the future, we get to abide in the present. Much of our energy is dissipated because of our obsession of the past or the future. Therefore, if we can concentrate on the present, there is no dissipation of energy. Our sages have said "Don't brood over the future or the past. Observe your thoughts as they occur, without identifying yourself with any of these thoughts. You will then be free from psychological time; you will be freed of all vasanas." We call something as good or bad based on our past experiences. But our experiences are unique to ourselves; they are not true for everyone. In this sense they are only partial, and not total.

If a person observes without identifying oneself with the thing observed, if a person can look at himself without condemnation or justification, without saying something is good or bad, he is free from psychological time. That is, he is not oppressed with what happened in the past, nor is he obsessed by what will happen in the future. Because of our obsession with the past or the future, we are not able to pay attention to the present. When a problem confronts me, immediately I worry about a solution to the problem and the moment I worry about the solution to the problems, I don't look at the problems completely. I look at only some aspect of the problem which I can tackle, so the problem gets solved to some extent but the problem crops up in some other form. When the mind is totally involved, when the

mind pays total attention to what is, instead of only paying attention to what was and what it is going to be, then this very attention gives you the solution. In fact, when somebody comes to discuss a problem with you and you pay total attention to what he says without any interruption, something happens to the other person; he gets a solution to the problem, without you offering it!

This is what happens when you go to a great jnani. You don't even have to tell him what the problem is. There is this complete communication through silence. He does not give the impression he knows everything; he behaves in a very ordinary way. Bhagavan never used to tell anyone that he was any different in any way from you. If somebody went and complained to him, he would listen, and he would listen as if nothing else in this world mattered. Even when dealing with a child Bhagavan would give his entire attention; therefore, he gave solutions to children's problems which none of us could have thought of.

We feel it is good to meditate but find it difficult to get time for it. But if we understand what meditation really is, we will know physical time does not actually matter. When meditation is done deeply as it should be, we will be able to finish our routine activities in a much shorter time. We get this extraordinary energy to pay attention to the present. The reason why we take more time ordinarily for any activity is this: our attention is diverted to a variety of things and is not focused on the present moment, on the job on hand. We are not paying total attention to it. Meditation does not mean closing our eyes; meditation means a state where there is no

